## గ్రూప్-1 మెయిన్స్ ఉచిత శిక్షణకు ఆహ్వానం




కమాన్ చౌరస్తా, జూలై 10: గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులు బుధవారం నుంచి ఈ నెల 19 వరకు వెబ్‌సైట్‌లో (www.tgbcstudycircle.cgg.gov.in) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 75 రోజులపాటు నిర్వహించే శిక్షణ ఈ నెల 22 నుంచి మొదలవుతుందని చెప్పారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5లక్షల లోపు ఉన్న అభ్యర్థులు అర్హులని చెప్పారు. శిక్షణకాలంలో నెలకు ₹5వేల ఉపకార వేతనం అందిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ (సైదాబాద్)లోని టీజీ బీసీ స్టడీ సర్కిల్ (రోడ్ నంబర్8, లక్ష్మీనగర్), ఖమ్మంలోని టీజీ బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ అందిస్తారని తెలిపారు. వివరాలకు నంబర్ (040-24071178)లో సంప్రదించాలని సూచించారు.

## 324 మంది స్టూడెంట్స్‌కు

# ఐదుగురే టీచర్లా..?



సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

- ఆగ్రహించిన రాజీవ్‌నగర్ పాఠశాల విద్యార్థుల పేరెంట్స్
- వెంటనే ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని డిమాండ్
- డీఈవో రమేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేత

సిరిసిల్ల కలెక్టరేట్, జూలై 10: సిరిసిల్ల రాజీవ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 324మంది విద్యార్థులకు ఐదుగురు టీచర్లే ఉండడంపై తల్లిదండ్రులు ఆగ్రహించి రోడ్డెక్కారు. తమ పిల్లల భవిష్యత్‌ను అంధకారంలో పడేయవద్దని ఆగ్రహించారు. సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. రాజీవ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో 122మంది, ఉన్నత పాఠశాలలో 202మంది ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్నారు. కేవలం ఐదుగురు ఉపాధ్యాయులతోనే పదో తరగతి వరకు విద్యార్థులకు బోధన చేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల గడుస్తున్నా.. ఇప్పటివరకు పూర్తి స్థాయిలో టీచర్లను నియమించక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహించారు. తమ చిన్నారులకు నాణ్యమైన విద్య అందడం లేదని ఆవేదన చెందారు. వెంటనే ఉపాధ్యాయులను పాఠశాలకు పంపించి, తమ పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న వెంటనే డీఈవో రమేశ్‌కుమార్ అక్కడికి చేరుకున్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్నాయని, ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజీవ్‌నగర్ పాఠశాలకు పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు వస్తారని తెలుపడంతో వారు ఆందోళన విరమించారు.

## మూడు జిల్లాలు కాదు.. మూడు రాష్ట్రాలకు

# అబార్షన్ రాకెట్

### జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా వెలుగులోకి భ్రూణహత్యలు

- తీగలాగితే బయటికొస్తున్న అనేక నిజాలు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ప్రధాన ఏజెంట్
- మూడు రాష్ట్రాల్లోని ఆర్ఎంపీలకు ఎరేసి దందా
- ఈ వ్యవహారం వెనుక పెద్ద ముఠా?
- స్థానిక పోలీసుల పర్యవేక్షణ కరువు?
- జిల్లా వైద్యారోగ్యశాఖ చోద్యం
- డీఎంహెచ్‌వో వింత సమాధానాలు!
- వెల్లువెత్తుతున్న విమర్శలు

సంచలనం రేపుతున్న 'నమస్తే' వరుస కథనాలు




'నమస్తే'లో ప్రచురితమైన కథనాలు

**జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా భ్రూణహత్యల రాకెట్ నడుస్తున్నది. ఇన్నాళ్లూ కేవలం మూడు జిల్లాలకే పరిమితం అనుకున్న ఈ దందా, ఏకంగా మూడు రాష్ట్రాలకు పాకినట్టు సమాచారం అందుతున్నది. 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలతో సంచలనం రేగుతుండగా.. తీగలాగితే డొంకంతా కదులుతున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంగా పని చేస్తున్న ఓ ఆర్ఎంపీ ఏజెంట్‌గా అవతారం ఎత్తి, ఈ వ్యవహారం నడుపుతున్నట్టు తెలుస్తున్నది. మూడు రాష్ట్రాల్లోని ఆర్ఎంపీలతో సంబంధాలు పెట్టుకొని.. ఇక్కడ అబార్షన్లు చేయిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలోనే డబ్బులు చేతులు మారుతున్నా.. ఈ కేంద్రాలకు మూడు రాష్ట్రాల నుంచి గర్భిణులు వచ్చి వెళ్తున్నా పోలీసుల పర్యవేక్షణ ఏమైందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మరోవైపు భ్రూణహత్యల విషయంలో జిల్లా వైద్యారోగ్యశాఖ చోద్యం, జిల్లా వైద్యాధికారి సమాధానంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**



కరీంనగర్, జూన్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా జరుగుతున్న భ్రూణహత్యలపై 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాలు సంచలనం రేపుతున్నాయి. మంగళవారం 'చిదిమేసింది ఎవరు?', బుధవారం 'భ్రూణ హత్యలపై కదిలిన యంత్రాంగం' శీర్షికన ప్రచురితమైన కథనాలు ఉమ్మడి జిల్లా వైద్యరంగంలో కలకలం రేపుతున్నాయి. ముఖ్యంగా జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతాల్లో హాట్‌టాపిక్ అయ్యాయి. దీనిపై ఇప్పటికే హుస్నాబాద్ పోలీసులు, ఒక అడుగు ముందుకేసి కూపీ లాగడంతోపాటు కొంత మందిని అరెస్ట్ చేశారు. ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుతో మరింత ముందుకెళ్తున్నారు. ఇటు 'నమస్తే తెలంగాణ' లోతుగా సేకరించిన వివరాల ప్రకారం చూస్తే.. ఈ వ్యవహారం వెనుక పెద్ద ముఠానే పని చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే ఇదో పెద్ద రాకెట్‌లా విస్తరించినట్టు స్పష్టమవుతున్నది. సాధారణంగా కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన వారికి అబార్షన్లు చేస్తున్నట్టు ఇన్నాళ్లు భావించినా, దీనిని మరింత లోతుగా చూస్తే మూడు జిల్లాలు కాదు.. ఈ రాకెట్ ఏకంగా మూడు రాష్ట్రాలకు పాకినట్టు సమాచారం అందుతున్నది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి ఇక్కడ అబార్షన్లు చేస్తుండగా, దీని వెనుక పెద్ద ముఠానే పని చేస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంగా ఓ ఆర్ఎంపీ ఏజెంట్ అవతారం ఎత్తి ఈ దందాలో కీలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నాడు. తన నెట్‌వర్క్‌ను మూడు రాష్ట్రాలకు విస్తరించాడు. ఆయా ప్రాంతాల్లో ఉండే ఆర్ఎంపీలకు అన్ని విషయాలు తెలిసే అవకాశముండడంతో వారికే ఎరవేసి, సంబంధాలు కొనసాగిస్తున్నాడు. వారు సూచించే కేసులను జమ్మికుంట, హుజూరాబాద్‌కు తీసుకొచ్చి, అబార్షన్లు చేయిస్తున్నట్టు సమాచారం. తీసుకొచ్చిన వారికి వాటా ముందుగానే ఇవ్వడం, ఆ తర్వాత దవాఖాన వర్గాలకు ముట్టజెప్పడంతోపాటు ఆయన సైతం పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాడు. అయితే గుట్టుచప్పుడు కాకుండా దందా నడస్తుండడంతో కొంత మంది ఈ ఏజెంట్‌ను ఆశ్రయిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదే అదునుగా డబ్బులు దండుకోవడంతోపాటు దర్జాగా అబార్షన్ల రాకెట్ నడుపుతున్నట్టు సమాచారం.

### ఏదీ పర్యవేక్షణ?

హుజూరాబాద్ కేంద్రంగా ఓ దవాఖానలో జరిగిన అబార్షన్ గురించి స్వయంగా ఓ యువతి ఫిర్యాదు చేయడం, హుస్నాబాద్ పోలీసులు ఇప్పటికే కొంత మందిని అరెస్ట్ చేశారు. నిందితుల సమాచారంతో మరికొంత మందిపై చర్యలు తీసుకోవడానికి ముందుకు సాగుతున్నారు. ఈ దందా జరుగుతున్న తీరును వరుస కథనాలతో 'నమస్తే తెలంగాణ' బయటపెట్టింది. అయితే జమ్మికుంట ఆ తర్వాత హుజూరాబాద్ కేంద్రంగా జరుగుతున్న భ్రూణ హత్యల అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాల్సిన జిల్లా వైద్యారోగ్య శాఖ తమకేమీ తెలియదన్నట్టుగా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. భ్రూణహత్యల విషయంలో యువతి ఫిర్యాదు, కేసు నమోదు, అరెస్ట్ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' బుధవారం జిల్లా వైద్యాధికారి (డీహెచ్ఎంవో) సుజాత దృష్టికి తీసుకెళ్లి, ఏమి చర్యలు తీసుకుంటున్నారని వివరణ కోరగా.. సదరు అధికారి వింత సమాధానాలు చెప్పారు. తమకు ఆ విషయంపై ఫిర్యాదు అందలేదని, అందితే తమ బృందాలను పంపిస్తామన్నారు. అయితే రెండురోజులుగా పత్రికలో వస్తున్న కథనాలు చూస్తున్నామని చెప్పారు. కథనాలు చూసినప్పుడు భ్రూణహత్యలకు పాల్పడుతున్నట్టు నిర్ధారణ అయిన దవాఖానకు మీరు ఏమైనా నోటీసు జారీ చేసి వివరణ కోరారా..? అన్న ప్రశ్నకు.. తమకు ఫిర్యాదు రాకపోవడంతో మేం ఏమీ చేయలేదన్నారు. మరోసారి కేసు హుస్నాబాద్‌లో అయింది కదా? అన్నారు. కానీ, అబార్షన్ అయింది మీ పరిధిలోని దవాఖానలోనే కదా? అంటే.. ఆమె సమాధానం దాట వేశారు. మరోసారి పోలీసులు తమకు సమాచారం ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. ఇవన్నీ చూస్తుంటే వైద్యారోగ్యశాఖ నిద్రపోతున్నట్టు కనిపిస్తున్నది.

### ఎన్నో అనుమానాలు

నిజానికి భ్రూణహత్యలు జరిగినట్టుగా ఎక్కడ నుంచి సమాచారం వచ్చినా జిల్లా వైద్యారోగ్యశాఖ సుమోటోగా తీసుకొని, తక్షణం బృందాలను రంగంలోకి దింపాలి. సదరు దవాఖానకు వెళ్లి సిబ్బందిని విచారించాలి. నిజాలు నిర్ధారించుకొని తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కానీ, అవేవి వైద్యారోగ్యశాఖలో కనిపించడం లేదు. నిజానికి ఈ విషయాన్ని డీహెచ్ఎంవో సీరియస్‌గా తీసుకోవాలి. ఆమె పరిధిలోని జిల్లాలోనే భ్రూణహత్య జరిగిందంటూ యువతి రాత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పుడు.. ఆ సమాచారం సదరు పోలీస్‌స్టేషన్ నుంచి తెప్పించుకోవాలి. సదరు దవాఖానలపై చర్యలు తీసుకోవాలి. కానీ, ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా జరుగుతున్న భ్రూణహత్యల వ్యవహారం మూడు రాష్ట్రాలకు విస్తరించడం, అక్కడి గర్భిణులను తీసుకొచ్చి ఇక్కడ అబార్షన్లు చేయిస్తున్న నేపథ్యంలో స్థానిక పోలీసులు పర్యవేక్షణ సైతం ఏమవుతుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ విషయంపై స్థానిక పోలీసులు ఇప్పటికైనా ప్రత్యేక దృష్టిపెట్టడంతోపాటు జయశంకర్ భూపాలపల్లికి చెందిన ఏజెంట్ నడుపుతున్న దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



నిందితుల అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

## భ్రూణహత్య కేసులో ముగ్గురు అరెస్ట్

- ఒకరు దవాఖాన నిర్వాహకుడు
- మరో ఇద్దరు సిబ్బంది
- 'నమస్తే' ఎఫెక్ట్

కరీంనగర్, జూలై 10 (నమస్తే తెలంగాణ) : జమ్మికుంట, హుజూరాబాద్ కేంద్రంగా జరుగుతున్న భ్రూణహత్యలపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు సంచలనం సృష్టిస్తున్నాయి. 'చిదిమేసింది ఎవరు' 'భ్రూణహత్యలపై కదిలిన యంత్రాంగం' శీర్షికన ప్రచురితమైన కథనాలు అనేక విషయాలను బహిర్గతం చేశాయి. ఇటు కథనాలు, అటు యువతి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హుస్నాబాద్ పోలీసులు ఇప్పటికే విచారణకు ప్రత్యేక బృందాన్ని రంగంలోకి దించారు. బాధిత యువతి కుటుంబసభ్యులు ఐదుగురితోపాటు టేకుమట్లకు చెందిన ఆర్ఎంపీని, జమ్మికుంటకు చెందిన సదరు ప్రైవేట్ దవాఖాన పీఆర్‌వోను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. హుజూరాబాద్‌లోని మాధవి నర్సింగ్‌హోంలోనే యువతికి అబార్షన్ జరిగినట్టు నిర్ధారించి ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. మరోవైపు లోతుగా విచారణ జరుపుతున్నారు. తాజాగా బుధవారం దవాఖాన నిర్వాహకుడు కర్ర పాపిరెడ్డి, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ సత్యనారాయణ, నర్సు రజితను రిమాండ్ చేశారు.

## కలెక్టరేట్‌లో మయూరం

నిత్యం అధికారులు, ప్రజలతో సందడిగా ఉండే కరీంనగర్ కలెక్టరేట్‌కు బుధవారం ఓ అతిథి వచ్చింది. అడవుల్లో ఉండే మయూరం జనారణ్యంలో సందడి చేసింది. భగత్‌నగర్ నుంచి కలెక్టరేట్ వైపు వచ్చే రోడ్డు వెంట హెలీప్యాడ్ గ్రౌండ్లో వేప చెట్టుపైకి చేరి కాసేపు సేదతీరింది. ఇది చూసిన సందర్శకుల్లో ఆనందం కనిపించింది.

– కరీంనగర్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్



## దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలి

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 10: కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు తమ సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం దివ్యాంగులకు ₹6వేల పెన్షన్‌తోపాటు వైకల్యానికి అనుగుణంగా పరికరాలు అందించాలని, ఇందిరమ్మ ఇండ్లు, రాజకీయ అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలని వేడుకున్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం రాజు మాట్లాడారు. దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు రాకేశ్, గొర్ల అయిలేశ్‌యాదవ్, సబ్బని రాములు, మానుక ప్రభాకర్, రాయికుంట వీరయ్య, బత్తిని సుధాకర్ ఉన్నారు.



పెన్షన్ రూ.6వేలు ఇవ్వాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు, పలు సంఘాల నాయకులు



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు, పారిశుధ్య, ఇతర రంగాల కార్మికులు

## లేబర్ కోడ్ రద్దు చేయాల్సిందే

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 10: కేంద్రంలోని బీజేపీ సర్కారు రూపొందించిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆశ కార్యకర్తలు, పారిశుధ్య, ఇతర రంగాల కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లు, బొగ్గు బ్లాకుల వేలంతోపాటు ప్రైవేటీకరణ విధానాలను రద్దు చేయాలని, కార్మికులకు నెలకు ₹26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. కార్మిక సంఘాలతో చర్చించాలని కోరుతుంటే.. ఏడు నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కేంద్రంలోని బీజేపీని అనుసరిస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాయమల్లు, నాయకులు కవ్వంపల్లి రవి, పున్నం రవి, ఆశ వర్కర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు సరిత, సరోజ, సదాలక్ష్మి, ప్రభాకర్, అంజయ్య పాల్గొన్నారు.

## రేకుర్తి అక్రమాలపై సర్వే

- అనుమతి లేని నిర్మాణాలు, ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్ల కేటాయింపుపై విచారణ
- నాలుగు బృందాలతో వారంపాటు ప్రత్యేక డ్రైవ్

**కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తిలో జరిగిన అక్రమాలను వెలికితీసేందుకు యంత్రాగం సిద్ధమైంది. ప్రభుత్వ భూముల కబ్జా, ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్ల కేటాయింపులపై వచ్చిన ఫిర్యాదులతో నగర ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ చర్యలు మొదలుపెట్టారు. రేకుర్తిలోని అన్ని ఇండ్లు, ఖాళీ స్థలాలపై పూర్తి స్థాయిలో సర్వే చేసేందుకు వారంపాటు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. అందుకోసం ప్రత్యేకంగా నాలుగు బృందాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.**

కార్పొరేషన్, జూలై 10: నగరపాలక సంస్థ విలీన గ్రామమైన రేకుర్తిలో ఇండ్లు, ప్రభుత్వ, ఖాళీ స్థలాలపై పూర్తి స్థాయిలో సర్వే కోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. అందుకోసం కమిషనర్ ప్రత్యేకంగా నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. రేకుర్తిలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నంబర్లు కేటాయించారని కోకొల్లలుగా ఫిర్యాదులు వచ్చాయి. వీటికి తోడుగా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి.. ఇంటి నిర్మాణాలు చేయకుండానే నగరపాలక సంస్థ నుంచి ఇంటి నంబర్ల కేటాయింపులు, అనుమతి లేకుండానే భవన నిర్మాణాలు చేపట్టారన్న ఫిర్యాదులు అందాయి. ఈ సర్వేలో ముఖ్యంగా అనుమతులు, సరైన పత్రాలు లేకుండా నిర్మాణాలు, ఆస్తిపన్ను మదింపు లేనివాటిని, తక్కువ మొత్తంలో ఆస్తిపన్ను మదింపు చేసినవాటిని, ఇంటి నిర్మాణాలు లేకుండా నంబర్లు కేటాయించిన వాటిని, ప్రభుత్వ భూములను సర్వే బృందాలు గుర్తించనున్నాయి. ఒక్కో బృందంలో నగరపాలక సంస్థకు చెందిన ఆర్ఐ, టీం లీడర్‌తోపాటు నలుగురు ఉద్యోగులు ఉండనున్నారు. రేకుర్తిలోని 1, 2 రెవెన్యూ బ్లాక్‌లను శ్రీకాంత్ ఆర్ఐ ఆధ్వర్యంలో, 3, 4, 5 బ్లాక్‌లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో, 6, 7, 8 బ్లాక్‌లు ఖలీల్ ఆధ్వర్యంలో, 9 నుంచి 12 బ్లాక్‌లు రషీద్ ఆధ్వర్యంలో సర్వే చేయనున్నారు.



















